పార్లమెంటు బరిలో భూపేశ్‌రెడ్డి

- కడప పార్లమెంటు టీడీపీ అభ్యర్థిగా ఐవీఆర్‌ఎస్ సర్వే
- జనం నుంచి ఫీడ్‌బ్యాక్
- ఎంపీ అభ్యర్థిగా భూపేశ్‌రెడ్డిని ప్రకటించిన చంద్రబాబు
- టీడీపీలో నయా జోష్



(కడప-ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ సొంత జిల్లాలో ఈసారి వైసీపీ జోరుకు కళ్లెం వేసేందుకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఆచితూచి అడుగులు వేశారు. 1994 ఎన్నికల్లో అప్పటి ఉమ్మడి కడప జిల్లా టీడీపీకి కంచుకోటలా ఉండేది. తరువాత పరిస్థితులు, నాయకత్వ లోపం కారణంగా పూలు అమ్ముకున్న చోట కట్టెలమ్ముకునే పరిస్థితి వచ్చింది. ఈ సారి ఎన్నికల్లో సొంత అడ్డాలోనే జగన్‌ను నిలువరించేందుకు చంద్రబాబునాయుడు అందుబాటులో ఉన్న అస్త్రాలన్నీ వాడుకుంటున్నారు. పులివెందులలో జగన్‌కు దీటుగా మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిని రంగంలోకి దింపారు. వివేకా హత్య, పులివెందులలో అక్రమాలు, అవినీతి, వైసీపీ నేతల కబ్జాలపై బీటెక్ రవి సంధిస్తున్న ప్రశ్నలు జనాల్లోకి దూసుకెళుతున్నాయి.

ఇక కడప సిట్టింగ్ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిపై టీడీపీ యువనేత భూపేశ్‌రెడ్డిని రంగంలోకి దింపింది. ఫ్యాక్షన్ గడ్డ జమ్మలమడుగు ప్రాంతానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ చదిపిరాళ్ల నారాయణరెడ్డి కుమారుడే భూపేశ్‌రెడ్డి. బీఏ ఎల్‌ఎల్‌బీ పూర్తిచేసిన ఈయన 2014లో మైలవరం జడ్పీటీసీ సభ్యుడిగా రాజకీయరంగ ప్రవేశం చేశారు. 2019కి ముందు జమ్మలమడుగు నుంచి భూపేశ్‌రెడ్డి చిన్నాన్న ఆదినారాయణరెడ్డి ప్రాతినిధ్యం వహించేవారు. ఆయన టీడీపీలో మంత్రిగా పనిచేశారు.

స్టీలు ఫ్యాక్టరీ పూర్తి చేస్తా..

టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, నారా లోకేశ్, అచ్చెన్నాయుడు నాపై ఎంతో నమ్మకంతో కడప పార్లమెంటు అభ్యర్థిగా ఎంపిక చేశారు. 2019లో చంద్రబాబు హయాంలోనే జిల్లాలో స్టీలు ఫ్యాక్టరీ నిర్మాణానికి అడుగులు పడ్డాయి. జగన్ సీఎం అయిన తరువాత శంకుస్థాపనలు తప్ప ఫ్యాక్టరీ గురించి పట్టించుకోలేదు. ఈ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి పోటీ చేస్తున్నాయి. కేంద్రంలో వచ్చేది ఎన్డీఏ ప్రభుత్వమే. నేను ఎంపీగా గెలిస్తే కడప జిల్లా యువత చిరకాల వాంఛ అయిన స్టీలు ఫ్యాక్టరీని పూర్తిచేసి నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి కల్పిస్తాం.

- భూపేశ్‌రెడ్డి, టీడీపీ కడప ఎంపీ అభ్యర్థి

రెండున్నరేళ్లుగా ఇంటింటికీ..

2019 ఎన్నికల్లో కడప పార్లమెంటు అభ్యర్థిగా ఆదినారాయణరెడ్డి పోటీ చేసి ఓడిపోయారు. జగన్ సీఎం అయిన తరువాత తన రాజకీయ ప్రత్యర్థులను జైల్లో ఇబ్బందులు పెట్టే కార్యక్రమానికి తెరలేపారు. దీంతో ఆదినారాయణరెడ్డి బీజేపీలో చేరిపోయారు. టీడీపీ అధిష్ఠానం భూపేశ్‌రెడ్డికి జమ్మలమడుగు ఇన్‌చార్జి అప్పగించింది. దాదాపు రెండున్నర సంవత్సరాలపాటు ఆయన, తన తండ్రి నారాయణరెడ్డి, చిన్నాన్న శివనాథరెడ్డి, ఇతర కుటుంబ సభ్యులుతో కలసి జమ్మలమడుగులో ప్రతి ఇంటితలుపు తట్టారు. చంద్రబాబు సీఎం అయితే జరిగే లబ్ధిని ప్రతి కుటుంబానికి వివరించారు.

కలిసివచ్చిన యువగళం సక్సెస్..

గత ఏడాది నారాలోకేశ్ జిల్లాలో నిర్వహించిన యువగళం పాదయాత్ర తొలి అడుగు జమ్మలమడుగు నియోజకవర్గంలో పడింది.. కడప జిల్లాలో తొలి సభను భూపేశ్‌రెడ్డి సూపర్‌సక్సెస్ చేశారు. దీంతో లోకేశ్ అండ్ టీం కూడా ఆ సభపై సంతోషం వ్యక్తం చేశారు. తరవాత భూపేశ్‌రెడ్డి పార్టీ ఆదేశాలను పాటిస్తూ నిత్యం జనాల్లో ఉండేవారు. అయితే పొత్తులో భాగంగా జమ్మలమడుగును బీజేపీకి కేటాయించడంపై టీడీపీ వర్గీయులు జీర్ణించుకోలేక పోయారు. భూపేశ్‌రెడ్డి ఇన్నాళ్లు కష్టపడితే ఇప్పుడు బీజేపీకి కేటాయిస్తారా అని మండిపడుతూ వచ్చారు. అయితే జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గంకాదు.. ఇప్పుడు ఏకంగా కడప పార్లమెంటుకే అభ్యర్థిగా భూపేశ్‌రెడ్డిని ప్రకటించడంతో టీడీపీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. ముఖ్యంగా భూపేశ్‌రెడ్డి యువకుడు. అందరినీ కలుపుకుని పోయే మనస్తత్వం ఉంది. ఐవీఆర్‌ఎస్ సర్వేలో కూడా భూపేశ్‌రెడ్డికే అనుకూలంగా వచ్చింది. రెండుసార్లు వైసీపీ నుంచి ఎంపీగా గెలిచిన వైఎస్ అవినాశ్‌రెడ్డితో ఢీకొనబోతున్నారు. ఆయన పులివెందుల పులి అయితే.. ఈయన జమ్మలమడుగు సింహం అంటూ భూపేశ్‌రెడ్డి అభిమానులు చెప్పుకొస్తున్నారు.

పేరు	: చదిపిరాళ్ల భూపేశ్ సుబ్బరామిరెడ్డి
భార్య	: జ్యోతి కాటసాని
పిల్లలు	: త్రినయనరెడ్డి, విక్రం ఆదిత్యరెడ్డి
తండ్రి	: చదిపిరాళ్ల నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ
తల్లి	: సరస్వతి
పుట్టిన తేదిీ	: 17 అక్టోబరు 1985
చదువు	: బీఏ ఎల్ఎల్‌బీ
రాజకీయ ఎంట్రీ	: 2014 మైలవరం జడ్పీటీసీ
ప్రస్తుతం	: కడప ఎంపీ అభ్యర్థి

అవినీతిపరుడికి టికెట్టుఇచ్చారు

- ఆత్మవిశ్వాసం చంపుకుని పార్టీలో ఉండలేను
- జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి
- వైసీపీకి రాజీనామా



కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, సర్పంచ్

ప్రొద్దుటూరు, మార్చి 29: "అవినీతి పరుడైన రాచమల్లు ప్రసాద్‌రెడ్డికి టికెట్టు ఇస్తే వైసీపీ ఘోరంగా ఓటమి పాలవుతుందని పార్టీ అధిష్ఠానానికి చెప్పినా మా మాటను పెడచెవిన పెట్టారు. స్వంత పార్టీ వైసీపీ నాయకులనే అణగదొక్కే అవినీతిపరుడు రాచమల్లుకే టికెట్టు ఇచ్చారు. దీంతో పార్టీకి రాజీనామా చేస్తున్నా" అని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ప్రకటించారు. ఆ మేరకు శుక్రవారం కడపకు వెళ్లి జిల్లా వైసీపీ అధ్యక్షుడు సురేశ్‌బాబుకు రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శివచంద్రారెడ్డి మాట్లాడుతూ 13 సంవత్సరాలుగా వైఎస్ కుటుంబానికి విధేయుడుగా ఉంటూ ప్రొద్దుటూరులో రెండుసార్లు రాచమల్లు ప్రసాద్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించటం కోసం పనిచేశానన్నారు. ప్రొద్దుటూరులో తనను రాజకీయ సమాధి చేయడానికి పంచాయతీలో వార్డు సభ్యులను రాచమట్టు కొని తనకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాడన్నారు. ఈ విషయం పార్టీపెద్దలకు చెప్పాననని, రెండుసార్లు పార్టీ పెద్దల ఆదేశాల మేరకు సర్దుకు పోయానన్నారు. అయినా రాచమల్లు కుట్రలు చేస్తూనే ఉన్నాడన్నారు. పార్టీ తమగోడు పట్టించుకోకుండా అతనికే మద్దతు పలకడంతో ఆత్మవిశ్వాసం చంపుకోలేక వైసీపీకి రాజీనామా చేస్తున్నానన్నారు. త్వరలో తన రాజకీయ భవిష్యత్తు నిర్ణయించుకుంటానన్నారు.

రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా సుగవాసి



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాజంపేట అసెంబ్లీ స్థానం టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు పెద్ద కొడుకు, ఉమ్మడి కడప జిల్లా పరిషత్ మాజీఛైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యంను తెలుగుదేశం పార్టీ ప్రకటించింది. శుక్రవారం ప్రకటించిన నాల్గవ విడతలో బాలసుబ్రమణ్యం పేరును ప్రకటించారు. దీంతో స్థానికంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బాలసుబ్రమణ్యంను కలిసి అభినందనలు తెలియజేశారు. తొలుత రాజంపేట పార్లమెంటు స్థానానికి బాలసుబ్రమణ్యం పేరును ఖరారు చేస్తున్నట్లు చంద్రబాబు అనధికారికంగా తెలియజేశారు. అయితే అనూహ్యంగా టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని భారతీయ జనతా పార్టీకి కేటాయించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ప్రటించిన జాబితాలో రాజంపేట అసెంబ్లీ స్థానం టీడీపీ అభ్యర్థిగా సుబ్రమణ్యం పేరును ఖరారు చేశారు. రాజంపేట అసెంబ్లీ టికెట్టును పలువురు ఆశించారు. అయితే జిల్లా వ్యాప్తంగా అనేక రాజకీయ సమీకరణల నేపథ్యంలో బాలసుబ్రమణ్యంకు టికెట్టు దక్కింది. దీంతో సుగవాసి కుటుంబానికి పుష్కర కాలం తర్వాత ప్రత్యక్ష ఎన్నికల బరిలో నిలిచే అవకాశం దక్కింది. 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో బాలసుబ్రమణ్యం తెలుగుదేశం పార్టీ తరపున రాయచోటి అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి ఓడిపోయారు. ఇక ఆ తర్వాత సుగవాసి కుటుంబానికి ఎన్నికల బరిలో నిలిచే అవకాశం రాలేదు. ఈసారి టీడీపీ రాయచోటి అసెంబ్లీ టికెట్టును మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డికి కేటాయించింది. ఈ నేపథ్యంలో బాలసుబ్రమణ్యంకు రాజంపేట అసెంబ్లీ స్థానానికి పోటీ చేసే అవకాశాన్ని చంద్రబాబు కల్పించారు.

వేడుకగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ శ్రేణులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నందమూరి తారక రామారావు పార్టీని ప్రకటించి 42 ఏళ్లు అయిన సందర్భంగా కడపలో 42కిలోల కేక్ కట్‌చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి, నేతలు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ప్రొద్దుటూరులో ఎన్‌టీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే అభ్యర్థి వరదరాజులరెడ్డి నేతలు సీఎం సురేశ్‌నాయుడు తదితరులు నివాళి అర్పించారు. బద్వేలులో రితేశ్‌రెడ్డి, విజయమ్మ తదితరులు టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్నారు.



నేడు చంద్రబాబు రాక

- ప్రొద్దుటూరులో ప్రజాగళం బహిరంగ సభ

కడప, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు శనివారం ప్రొద్దుటూరులో జరిగే బహిరంగసభలో పాల్గొననున్నారు. ప్రజాగళం పేరిట చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత పర్యటన చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ప్రొద్దుటూరులో నిర్వహించే బహిరంగసభకు హాజరుకానున్నారు. నెల్లూరు జిల్లా పర్యటన ముగించుకుని చంద్రబాబునాయుడు ఉదయం 10.45కు ప్రొద్దుటూరులోని కొర్రపాడు రోడ్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డుమార్గాన బయల్దేరి 11గంటలకు బహిరంగసభ జరిగే పుట్టపర్తి సర్కిల్‌కు చేరుకుంటారు. 12.30 వరకు బహిరంగసభలో పాల్గొంటారు. 12.45 నుంచి 1.45 వరకు జిల్లా నేతలతో చర్చిస్తారు. అనంతరం 2గంటలకు హెలిక్యాప్టరు ద్వారా తిరుపతి జిల్లాలోని నాయుడుపేట బయల్దేరి వెళతారు.

పేదల అభ్యున్నతే టీడీపీ లక్ష్యం

● తెలుగు దేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి ● ఘనంగా టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవం





ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి... రహ్మతీయ ఫంక్షన్‌హాలులో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న అమీర్‌బాబు, లక్ష్మీరెడ్డి.. వల్లూరులో...

కడప (ఎర్రముక్కపల్లె),మార్చి 29 : బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా టీడీపీ ఏర్పడింద ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరం ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధనరెడ్డి ఆధ్వర్యంలో 42 కేజీల భారీ కేక్‌ను కటింగ్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యద ర్శి హరిప్రసాద్, వీరయ్య, జిలానీబాషా,పెద్దసంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

రహ్మతీయ ఫంక్షన్‌హాలులో...
కడప నగరం రహ్మతీయ ఫంక్షన్ హాలులో సీనియర్ నాయకుడు అమీర్‌బాబు, అలంఖాన్‌పల్లె లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదవారికి ఆకలి తీర్చేందుకు కిలో రూ.2కే బియ్యం తీసుకువచ్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లింగాల శివశంకర్‌రెడ్డి, వెంకటేశ్, జయరామిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, పిచ్చయ్య, సీఎస్ నాసర్‌ఆలీ, మేకల వెంకటేశ్‌యాదవ్, బుర్రిరాజాయాదవ్, రామలక్ష్మమ్మ, స్వర్ణలత, నిర్మల, శ్రీదేవి, మల్లేశ్వరి, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన టీడీపీకే సాధ్యం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి
సంక్షేమ పాలన టీడీపీకే సాధ్యమని టీడీపీ కడప నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి తెలిపారు. శుక్రవారం 46వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఆర్‌ఎస్‌యూ ఆధ్వర్యంలో...
కడప నగరం బృందావనకాలనీలో ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రె డ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి పంచిపెట్టారు. జనసేన నాయకులు తుంగా రమణయ్య, టీడీపీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, శివకొండారెడ్డి, జయరాం, రెడ్డయ్య, రవిశంకర్, ఆర్‌ఎస్‌యూ ప్రశాంత్, చెన్నకేశవరెడ్డి, జగదీశ్, శివతో పాటు పలువురు పాల్గొన్నారు.

కమలాపురంలో... టీడీపీ కార్యాలయం వద్ద పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి పార్టీ జెండా ఎగురవేశారు. పొడదుర్తి పంచాతీ కొత్తపల్లె గ్రామానికి చెందిన పది కుటుంబాలవారు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి పుత్తా పార్టీ కండువా వేసి ఆహ్వానం పలికారు.

వల్లూరులో...
టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ ప్రజల పార్టీ అని, ప్రజల కోసం, వారి అభివృద్ధి కోసం పోరాడుతుందని, ప్రజారంజకపాలన సాగించాలంటే ఆ పార్టీకే సాధ్యమన్నారు. గడికోట సుధాకర్‌రెడ్డి, పుల్లగూర శ్రీనివాసులు, మదన్‌మోహన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, వీరారెడ్డి, అర్జున్‌రెడ్డి, ఓబులేసుయాదవ్, వెంకటసుబ్బయ్య తదితర తెలుగుతమ్ముళ్లు పాల్గొన్నారు.

పులివెందులలో...
టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పులివెందుల పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవి సోదరుడు మారెడ్డి జయభరత్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు రఘునాథరెడ్డి టీడీపీ జండా ఎగురవేసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు శివమోహన్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, అన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, మదుసూదన్‌రెడ్డి, రాఘవరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చక్రాయపేటలో...
వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయాలని ఆ పార్టీ నాయకులు ప్రజలను కోరారు. శుక్రవారం మండలంలోని కుప్పం గ్రామం నడింపల్లె, కొండిగారిపల్లె, బలిజపల్లె, కె.వడ్డిపల్లెలోఎన్నికల ప్రచారం నిర్వహించారు. పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి సోదరుడు జోగిరెడ్డి, మండల ఇన్‌చార్జి తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి టీ డీపీ మేనిఫెస్టోను వివరించారు. ముందుగా ఎన్నికల ప్రచారానికి వచ్చిన నాయకులకు ఆయా గ్రా మాలలో కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.





కమలాపురంలో పార్టీ కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న పుత్తా నరసింహారెడ్డి... పులివెందులలో టీడీపీ జండా ఎగురవేస్తున్న దృశ్యం... చక్రాయపేటలో జోగిరెడ్డి, మహేశ్వర్‌రెడ్డిలకు హారతి ఇస్తున్న మహిళ

మనసున్న మనిషి చిన్న రంగనాయకులు

చక్రాయపేట, మార్చి 29: 'పరోపకారం పుణ్యాదాయకం' అంటారు.. ఇలా కొందరు తోటి మనిషికి సాయపడుతుంటారు. కానీ రంగనాయకులు అలా కాదు... మూగజీవుల ఆకలి తీరుస్తుంటారు.. మనుషులైతే తమకు ఏమి అవ సరమో అడుగుతారనీ, కానీ మూగ జీవులు ఆకలి బాధను కూడా చెప్పుకోలేవనీ, అందుకే వాటి ఆకలి తీరు స్తుంటాననీ చెబుతారు ప్రొద్దుటూరుకు చెందిన చిన్న రంగనాయకులు.. ఈయన గండి అంజనేయస్వామి భక్తుడు. గండి దేవస్థానంలో కోతులు, కొండముచ్చులు ఉన్నాయి. వేసవి వస్తే నీరు, ఆహారం లేక కొండలలో తిరుగుతుంటాయి. అది గమనించిన రంగనాయకులు గత పది సంవత్సరాలుగా తన కున్న స్థోమతతో పాటు ఇతరుల సాయంతో వాటికి అరటిపండ్లు, సపోట, కమలాపండ్లు, జామకాయలను తెచ్చి పాపాఘ్ని నదీ తీరప్రాంతంలోని శివాలయం, గండి క్షేత్రంలోని అంజన్నగుడి, నామాలగుండు, పెద్ద గుండు సమీపాల్లో ప్రతి మంగళ, శనివారాల్లో ఆహారంగా అందిస్తుంటారు. అంతేకాకుండా వేసవి కాలంలో నీరు లేకుంటే తొట్టిని ఏర్పాటుచేసి నీటిని నింపుతుంటారు. అలాగే ప్రతి గురువారం అహోబిలంలోని అడవులలో ఈ పండ్లను వేస్తుంటారు. మూగజీవులకు ఆహారాన్ని అందించడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. అలాగే దాతలు ఉంటే 779949459 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.



గండి క్షేత్రంలో వానరాలకు ఆహారం అందిస్తున్న చిన్న రంగనాయకులు

'రాయలసీమ అభివృద్ధి కోసం పోరాడాలి'

కడప (నాగరాజుపేట), మార్చి 29 : రాయలసీమ అభివృద్ధి కోసం ఐక్యంగా పోరాటాలు నిర్వహిస్తామని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యోజన సమైఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు అన్నారు. శుక్రవారం తమ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాయలసీమకు చేసిందేమీ లేదన్నారు.

కమిటీ ఏర్పాటు: రాయలసీమ అభివృద్ధి వేదిక రాష్ట్ర కన్వీనరు కారు ఆంజనేయులు, కో కన్వీనరు ఓబయ్య, బ్లడ్‌టు లీవ్ వ్యవస్థాపకుడు పవన్‌కుమార్ అధ్యక్షతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్‌సాదిక్, ప్రధాన కార్యద ర్శి డీఎం ఓబులేసు, ఉపాధ్యక్షుడు యూసఫ్, రవికుమార్ సహాయ కార్యదర్శులు హరితరుణ్, మారుతి, సురేష్, కమిటి సభ్యులు పృథ్వీరాజ్, యశ్వంత్, పవన్, గణేశ్, ఫయాజ్, మొత్తం 19 మంది కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

బైబిల్ మిషన్ స్వస్థతశాలలో ప్రత్యేక ప్రార్థనలు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 29 :భాకరాపేట బైబిల్ మిషన్ దేవుని స్వస్థత శాలలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి .మాధవీరెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించి చంద్రబాబు సీఎం కావాలని అలాగే కడప నియోజకవర్గంలో తాము విజయం సాధించాలని ప్రార్థనలు చేసినట్లు తెలిపారు.

జగన్‌ను సాగనంపేందుకు ప్రజలు సిద్ధం

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, మార్చి 29 : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కోగటం గ్రామంలో బాబుతో భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019లో ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారం చేపట్టిన జగన్‌కు సరైన సమాధానం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాగా కోగటం గ్రామం మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి స్వగ్రామం కావడంతో గతంలో ఎన్నికల ప్రచారంలో గొడవలు జరిగినందున, ఈ సారి గొడవలు జరగకుండా డీఎస్పీ, ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్ఐలు, 100 మంది బెటాలియన్ పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. టీడీపీ నాయకులు వేటూరి రామచంద్రారెడ్డి, చెన్నూరు శివారెడ్డి, ఓబయ్య, ఖాదర్‌బాషా, జంపాల నర్సింహారెడ్డి, మండల కన్వీనరు రాఘవరెడ్డి, దివాకర్‌రెడ్డి, కంకరసుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, ధర్మారెడ్డి, వాసుదేవరెడ్డి, ఎల్లారెడ్డి, సుబ్బరాయుడు, రామమునిరెడ్డి, మల్లేష్ రాయల్, వేణుగోపాల్‌రెడ్డి, నరసింహులు, నరేంద్ర, శంకర్‌యాదవ్, రవిశంకర్‌యాదవ్, దాదిరామయ్య పాల్గొన్నారు.

'టీడీపీ విజయానికి కృషి చేస్తాం'
కమలాపురం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి విజయానికి ముస్లిం మైనార్టీలందరూ కృషి చేస్తామని ముస్లిం మైనార్టీ అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్ తెలిపారు. శుక్రవారం కోగటంలో పుత్తా నరసింహారెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని ప్రజలను కోరారు.

టీడీపీ వస్తే మరిన్ని సంక్షేమ పథకాలు
చెన్నూరు, మార్చి 29: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తారని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సతీమణి పుత్తా సరళమ్మ, యువనేత పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి సతీమణి శ్రీచైతన్య పేర్కొన్నారు. చెన్నూరులోని కొత్తగాంధీనగర్ ఎస్సీ కాలనీ, బెస్తకాలనీలో శుక్రవారం బాబుతోనే భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర మత్స్యసాధికార సమితి సభ్యుడు మల్లె వెంకటసుబ్బయ్య, సీనియర్ నేత జి.బాలగురయ్య, మాజీ ఎంపీటీసీ పుల్లయ్య, మండల కన్వీనరు కె.విజయభాస్కరరెడ్డి, మండల కార్యదర్శి అతికారి విశ్వం, అధికార ప్రతినిధి జడా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బెస్తకాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పుత్తా సరళమ్మ, పుత్తా శ్రీచైతన్య

'మున్సిపాలిటీ టీచర్ల రేషనలైజేషన్ ఆపాలి'

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 29: మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయులను ప్రభుత్వ ఉత్తర్వులు 117 ప్రకారం రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాలనే ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్, చెంగల్‌రెడ్డి, జిల్లా నాయకులు ఈశ్వర్‌చంద్ర, ఆలీఖాన్ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యాసంవత్సరం పూర్తి కావస్తుండటం, వార్షిక పరీక్షలు జరుగుతుండటంతో సరికాని నిర్ణయాల వల్ల విద్యార్థులకు నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. జీఓ 117ను రద్దు చేయాలని, ఇది పాఠశాల విద్యకు ఆటంకం కలిగించే ఉత్తర్వు అని తెలిపారు. కానీ పదోన్నతుల ప్రక్రియను మున్సిపాలిటీ ఉపాధ్యాయులకు కొనసాగించాలన్నారు. కేజీబీవీ, కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమం టైంస్కేలు మంజూరు చేయాలని ఈ సందర్భంగా కోరారు.

వైసీపీతో దివ్యాంగులకు ఒరిగిందేమీ లేదు

● టీడీపీ దివ్యాంగుల విభాగ రాష్ట్ర నాయకుల ఆగ్రహం

కడప (మారుతీనగర్), మార్చి 29: వైసీపీ గత ఐదేళ్ల పాలనలో దివ్యాంగులకు ఒరిగిందేమీ లేదని టీడీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి దాది శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై. వీరారెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం ద్వారకానగర్‌లోని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జగన్‌మో హన్‌రెడ్డి పాలనలో దివ్యాంగుల బతుకులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు పాలనలో అందే సబ్సిడీ రుణాలను కూడా అటకెక్కించారన్నారు. వచ్చే ఎన్నికల్లో దివ్యాంగులంతా ఏకమై జగన్‌రెడ్డి పాలనకు అంతం పలికి చంద్రన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోగలిగినపుడే దివ్యాంగులందరికీ మంచి రోజులు రాగలవని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

బద్వేల్ అభ్యర్థిగా నాకు అవకాశం కల్పించండి

● బీజేవైఎం మాజీ జాతీయ కార్యదర్శి పనతల సురేష్

కడప (మారుతీనగర్), మార్చి 29: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బద్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కూటమి (టీడీపీ-జనసేన-బీజేపీ) అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని భారతీయ జనతా యువమోర్చా మాజీ జాతీయ కార్యదర్శి పనతల సురేష్ కోరారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 20 సంవత్సరాలుగా విద్యార్థి దశ నుంచే బీజేపీ పట్ల విధేయుడిగా ఉంటూ బీజేవైఎం జాతీయ నాయకుడి వరకు ఎదిగానన్నారు. సమైక్యాంధ్ర విషయంగా కూడా ఆమరణ దీక్ష చేసినట్లు గుర్తు చేశారు. ఆ పరంపరలో పలు కేసులు, సెంట్రల్ జైల్ లో ఉంచినా బేడీలతోనే పరీక్షలు రాసినట్లు తెలిపారు. తనకు అవకాశం ఇవ్వకుంటే దీనిపై రాష్ట్రంలోని దళితులకు వివరించి పోరు సాగిస్తానని ఈ సందర్భంగా హెచ్చరించారు.

నకిలీ మద్యంతో ప్రజల జీవితాలతో చెలగాటం

● కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు

కడప(కలెక్టరేట్), మార్చి 29: వైసీపీ ప్రభుత్వం నకి లీ మద్యంతో ప్రజల జీవితాలతో చెలగాటమాడుతోందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. అధికారంలోకి రాగానే ఏకంగా తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యునికి పథకాలు అందకుండా నడ్డి విరిచారన్నారు. వచ్చే ఎన్నికల్లో అన్ని వర్గాలకు సమన్యాయం చేసే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి ప్రత్యేక హోదా సాధనలో జిల్లా ప్రజలంతా భాగస్వాములు కావాలనీ జిల్లా అధ్యక్షుడు ఆప్రకటనలో పిలుపు నిచ్చారు.

మానవుల రక్షణ కోసమే క్రీస్తు ప్రాణత్యాగం

కమలాపురం రూరల్, మార్చి 29 : సర్వమానవ పాప విముక్తి కోసం యేసుక్రీస్తు సిలువలో ప్రాణత్యాగం చే శారని దైవ బోధకులు పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆర్సీఎం, సీఎస్ఐ చర్చిలు, అలాగే ఇతర ప్రార్థనా మం దిరాల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. లోకరక్షకుడు పుట్టిన రోజు క్రిస్మస్, శిలువ వేసిన రోజు గుడ్‌ఫ్రైడేగా సమాధి నుంచి పునరుత్థానుడిగా వచ్చిన రోజు ఈస్టర్‌గా జరుపుకుంటారని వారు వివరంచారు. ఈ సందర్భంగా విశ్వాసులు తాము చేసిన పాపాల నుంచి రక్షించమని చర్చిలో ప్రార్థిం చారు. బైబిలు పఠిస్తూ శిలువ వృత్తాంతాన్ని ప్రసంగాల ద్వారా వినిపించారు. కొంతమంది క్రైస్తవులు ఉపవాసాలు పాటించారు.

వల్లూరులో...
యేసుక్రీస్తు శిలువ వేయబడి మనుషులను పాపాలనుంచి విముక్తి చేసిన పవిత్ర దినంగా గుడ్‌ఫ్రైడేను పేర్కొంటారు.అందులో భాగంగా మండల పరిధిలోని వల్లూరు, శీతోరుపల్లె తదితర గ్రామాల్లోని క్రిష్టియన్లు చర్చిలకు వెళ్లి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. శిలువ వేషధారణలో నడుస్తూ శిలువపై యే సుక్రీస్తు చెప్పిన ఏడు ప్రవచనాలు పఠించారు. శీతోరుపల్లె గ్రామంలో ఫాదర్ చిన్నప్ప ఆధ్వర్యంలో, పైడికాల్వ గ్రామంలోశిలువ మోస్తూ గ్రామస్థులు ఊరేగించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్ చిన్నప్ప వారికి యేసు బోధనలు వివరించారు. శిలువ మోసిన వారిలో ఉత్తయ్య, రాజవర్దన్, చిట్టిబాబు, లూర్దురెడ్డి, ప్రసన్న, విజయ్ ఉన్నారు.

న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో...
కడప (కల్చరల్), మార్చి 29: స్థానిక 48వ డివిజన్ కృపా కాలనీ న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ చర్చి పాస్టర్ పి. మహేష్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహిం చారు. సిస్టర్ శాంతమ్మ, సంఘ పెద్దల ఆధ్వర్యంలో చ ర్చి నందు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉపవాసంలో ఉన్న విశ్వాసులకు చల్లని పానీయాలు పంపిణీ గావించారు. కార్యక్రమంలో రవితేజ, సుధాకర్, రవి, శాంతిరాజు, రోజా, లీలావతి, అగస్టీన్, మహిమ, పార్వతమ్మ, సుంకమ్మ పాల్గొన్నారు.



కమలాపురంలో శిలువ మోస్తున్న యేసుక్రీస్తు భక్తుడు

వీరపునాయునిపల్లెలో...
ఉదయాన్నే క్రైస్తవులందరు చర్చిలకు వెళ్లి ప్రార్థనలు చేసి కీర్తనలు ఆలపించారు. యేసు పలికిన ఏడు మాటలను స్మరించుకున్నారు.

ప్రొద్దుటూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాచమల్లు ప్రసాద్‌రెడ్డిని సీఎం జగన్ మందలించినట్లు విశ్వసనీయ సమాచారం. అధికారంలోకి రావడానికి పార్టీకోసం పనిచేసిన వారిని అందరినీ కలుపుకుని పోవ డంలో విఫలమయ్యాడని క్లాస్ పీకినట్లు పార్టీలోని ముఖ్య నేతలు కొందరు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. ప్రొద్దు టూరు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి బస్సుయాత్రలో జగన్ వెంట కూర్చున్నప్పుడు ఈ చర్చ జరిగినట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం ప్రొద్దుటూరులో నిర్వహించిన 'మేమంతా సిద్ధం' సభ సందర్భంగా పార్టీలో అసంతృప్తులు బహిర్గతమవడంతో జగన్ ఆయనకు క్లాస్ పీకినట్లు చెబుతున్నారు. అంతేకాకుండా ఇడుపులపాయ నుంచి బస్సుయాత్రలో జగన్ వెంట ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్ పాల్గొని ఎర్రగుంట్ల వరకు వచ్చి అక్కడ దిగిపోయి ప్రొద్దుటూరు సభకు రాకపోవడంపై కూడా జగన్ వాకబు చేసినట్లు సమాచారం.

రాచమల్లుపై జగన్ అసంతృప్తి

- పార్టీలో అందరినీ కలుపుకుని పోలేదంటూ క్లాస్ పీకిన వైనం
- ప్రొద్దుటూరుకు వరాలివ్వలేదని.. జగన్‌పై రాచమల్లు గుర్రు



ప్రొద్దుటూరు, మార్చి 29: కొంతకాలంగా ప్రొద్దుటూరులో అసమ్మతి నేతలను కలుపుకోవడం కంటే వారిని ఎలాగైనా పార్టీలో నుంచి బయటికి వెళ్లేలా చేసేందుకు ఎమ్మెల్యే రాచమల్లు పొమ్మనలేక పొగపెట్టాడనే చందంగా వ్యవహరించంపై పార్టీ దృష్టి పెట్టిందని చెబుతున్నారు. ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్ తప్ప సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, వైసీపీ మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి, పొట్టు లక్ష్మీరెడ్డి, వైసీపీ కౌన్సిలర్లు మహ్మద్‌గౌస్, మునీర్, ఇర్ఫాన్, మాజీ జడ్పీటీసీ వెల్లాల భాస్కర్ ఆయన భార్య పార్టీని వీడటం.. మరికొందరు పార్టీకి దూరంగా ఉండటం జగన్ దృష్టికి వెళ్లినట్లు సమాచారం. అంతేకాకుండా పార్టీపై అసంతృప్తిని బహిరంగంగా వ్యక్తం చేయకుండా.. మాజీ మున్సిపల్ చైర్మన్ ఉండేల గురివిరెడ్డి, జిల్లా రైసు మిల్లుల సంఘం అధ్యక్షుడు కేఎంఆర్ ట్రావెల్స్ అధినేత మునిరెడ్డి మరో వ్యాపారవేత్త శేగిరెడ్డి గంగిరెడ్డి, మాజీ టీటీడీ బోర్డు సభ్యుడు చిప్పగిరి ప్రసాద్, పద్మశాలీయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి సైతం ఇటీవల పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. వీరు ఎమ్మెల్యేతో పాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం లేదు. అయితే.. ఇటీవల ఎంపీ అవినాశ్‌రెడ్డి శేగిరెడ్డి గంగిరెడ్డి, కేఎంఆర్ ట్రావెల్స్ అధినేత మునిరెడ్డి ఇంటికివెళ్లి అసంతృప్తులను చల్లార్చే ప్రయత్నం చేశారు. ఐదేళ్ల అధికారంలో ఉన్నా.. పార్టీకోసం పనిచేసిన వారు ఎలా ఉన్నారని ఇక్కడి ఎమ్మెల్యే రాచమల్లు గానీ ఎంపీ అవినాశ్‌గానీ పట్టించుకోకుండా ఎన్నికలప్పుడు వచ్చి మేము మీకు అండగా ఉంటాం అని చెబితే నమ్మలేం అని కొందరు ఖరాఖండిగా చెప్పారని అంటున్నారు. ఇదే విషయం చెప్పి కేఎంఆర్ ట్రావెల్స్ అధినేత వైసీపీని వీడారు. దీంతో ఇటీవలే శేగిరెడ్డి గంగిరెడ్డిని, మాజీ మున్సిపల్ చైర్మన్ గురివిరెడ్డి కుమారుడిని మరికొందరిని జగన్‌తో నేరుగా కలిపించి మాట్లాడించారు. దీంతో వ్యాపారవేత్త శేగిరెడ్డి గంగిరెడ్డి తప్ప మాజీ చైర్మన్ ఉండేల గురివిరెడ్డి మాత్రం ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉన్నారు. ఇటీవల నలుగురు చేనేత కమ్యూనిటీకి చెందిన కౌన్సిలర్లు టీడీపీలోకి వెళ్లగా వారిని బుజ్జగించి మళ్లీ తెచ్చుకోవడం లాంటి విషయాలు కూడా పార్టీ దృష్టిలో ఉన్నాయి. వారం క్రితం ప్రొద్దుటూరు వైసీపీ పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి సుబ్రమణ్యం (బాబు) ఆ పార్టీకి రాజీనామా చేశారు. వీటన్నింటితో పాటు రాచమల్లు వ్యవహార శైలిపై జగన్ తీవ్రంగా మండిపడ్డట్టు చెబుతున్నారు. వైసీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మొట్టమొదటి సభ ప్రొద్దుటూరులో నిర్వహించారు. ఇది ఆ పార్టీకి ఎంతో ప్రాధాన్యం. ఇలాంటి సభలో కూడా వెల్లాల ప్రభాకర్ రెడ్డి ఒక్కడిని తప్ప.. ప్రొద్దుటూరులో ఇతర ప్రముఖులెవరినీ వైసీపీలోకి తీసుకురాలేకపోవడంపై కూడా జగన్ అసహనం వ్యక్తం చేశారని అంటున్నారు.

జగన్‌పై.. రాచమల్లు గుర్రు

ప్రొద్దుటూరులో మొట్టమొదట జిల్లాస్థాయిలో వైసీపీ వారు 'మేమంతా సిద్ధం' సభ నిర్వహించారు. అయితే ఈ ప్రాంత ప్రజలకు ఏమి చేస్తామనేది సభ సాక్షిగా జగన్ వరాల్విక పోవడంపై రాచమల్లు గుర్రుగా ఉన్నట్లు సమాచారం. ప్రొద్దుటూరులో జగన్ రూ.516 కోట్ల పనులకు శిలాఫలకాలు వేయగా అవి వివిధ దశల్లో ఉన్నాయి. ఈ అభివృద్ధి పనుల పై జగన్ కనీసం ప్రస్తావించకపోవడంతో రాచమల్లు కొంత అసంతృప్తిగా ఉన్నట్లు అనుచరులు చెబుతున్నారు. తన సొంతూరిలో సభ ఏర్పాటు చేసి తనకు ప్రసంగించడానికి సమయం ఇవ్వకపోవడం కూడా రాచమల్లులో అసహనం పెంచిందని అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తే ప్రొద్దుటూరుకు తాను ఏమి చేయదలిచాడో జగన్ నోట చెప్పించాలని ప్రయత్నించిన రాచమల్లుకు ఆ అవకాశం ఇవ్వకపోవడంతో ఆయన గుర్రుగా ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో రాచమల్లు తాను ప్రొద్దుటూరుకు కోరుకున్న వరాలకు సంబంధించిన వినతిపత్రం మాత్రం జగన్ చేతిలో పెట్టారని అంటున్నారు. అందువల్లే ప్రొద్దుటూరు సిద్ధం సభ పెద్దగా ఊపు ఇవ్వలేకపోయిందని తన అనుచరుల వద్ద రాచమల్లు ఆవేదన చెందినట్లు సమాచారం.

సర్వమానవాళి సంతోషంగా ఉండాలి



పెద్దదర్గాకు పూలచాదర్ తీసుకెళ్తున్న ఆర్.శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి

కడప (కల్చరల్), మార్చి 29: సర్వమానవాళి కలిసి మెలసి సంతోషంగా ఉండాలని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ అభ్యర్థి మాధవీరెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, సానపురెడ్డి రవిశంకర్‌రెడ్డి ఆకాంక్షించారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు షేక్ జిలానీబాషా ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అమీన్‌పీర్ దర్గా (పెద్ద దర్గా)లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. టీడీపీ నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి, నాయకులు యాటగిరి రాంప్రసాద్, మాసాపేట శివ, చిట్టిబోయిన సుబ్బరాయుడు, శివారెడ్డి, అఫ్సర్‌ఖాన్ తో పాటు పలువురు నాయకులు, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కల్వరి యాత్ర



కడపలో నిర్వహించిన శిలువ మార్గం కార్యక్రమంలో ఓ దృశ్యం

కడప (కల్చరల్), మార్చి 29: శుభ శుక్రవారం (గుడ్‌ఫ్రైడే) సందర్భంగా నగరంలోని సంధ్య సర్కిల్ వద్ద గల డాన్‌బోస్కో ఐటీఐ నుంచి ఆరోగ్యమాత చర్చి వరకు అలాగే ఆంతోని నగర్ నుంచి మాసాపేట సర్కిల్ మీదుగా చర్చి వరకు 14 ఘట్టాల శిలువ మార్గాన్ని విశ్వాసులు భక్తిశ్రద్ధలతో ప్రదర్శించారు. అనంతరం శిలువపై ఏసుక్రీస్తు పలికిన ఏడు మాటలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాసాపేట సెయింట్ జాన్ చర్చి విచారణ గురువు ఫాదర్ గుడిమే దేవసహాయం మాట్లాడుతూ నీ కోసం- నీ పాపముల కోసం- నీకు నిత్యం రక్షణ అనుగ్రహించాలని క్రీస్తు ప్రభువు తన ప్రాణాన్ని బలిగా సమర్పించారన్నారు. ఈ కారణం చేతనే మనకు శుభం చేకూరిందని, అందుకే నేడు సకల ప్రజలకు శుభ శుక్రవారంగా పిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఫాదర్లు బాబు, మనోహర్, శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్, పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

విశ్వం పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ అవగాహనా సదస్సుకు విశేష స్పందన

తిరుపతి(విద్య), మార్చి 29: తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పాలిటెక్నిక్, ఎ.పి.ఆర్.జె.సి నమూనా ప్రవేశ పరీక్షకు, అవగాహనా సదస్సుకు విశేష స్పందన లభించిందని ఆ విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థినీ విద్యార్థులు హాజరై నమూనా పరీక్షలు రాశారని చెప్పారు. 2023 పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో విశ్వం విద్యార్థిని చరితశ్రీ 120కి గాను 119 మార్కులతో ప్రథమ ర్యాంకు సాధించిందని వెల్లడించారు. అలాగే ఏపీఆర్జేసీ ఫలితాల్లో తనూజ, భువనేశ్వర్ రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాకులను సాధించారని వివరించారు. పాలిటెక్నిక్‌లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్స్, కంప్యూటర్ ఇంజినీరింగ్, మైనింగ్, కెమికల్, బయోమెడికల్ తదితర కోర్సులు ఉంటాయని, మెరుగైన ర్యాంకు సాధించడం ద్వారా మంచి కళాశాలలో సీట్లతోపాటు ఉపాధి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని వివరించారు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27 ఉంటుందని, ఏప్రిల్ 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏపీఆర్జేసీ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25వ తేదీన ఉంటుందని, మార్చి 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8688888802, 9399976999లలో సంప్రదించాలని కోరారు.

తనిఖీల్లో రూ.14 లక్షలు స్వాధీనం

చిట్వేలి, మార్చి29 : చిట్వేలి-రాపూరు ప్రధాన రహదారిలోని రాజుకుంట క్రాస్ రోడ్డు వద్ద ఉన్న పోలీసు చెక్‌పోస్టులో చేపట్టిన తనిఖీల్లో శుక్రవారం మధ్యాహ్నం రూ.14లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. కోడూరు, రాజంపేట ప్రాంతాల నుంచి ప్రతి శుక్రవారం కొందరు రైతులు, జీవాల వ్యాపారులు మ్యాక్సీల్లో గూడూరు సంతకు జీవాలను తీసుకెళ్లి అమ్ముకుని, అక్కడి నుంచి కొన్ని జీవాలను తెచ్చుకోవడం అలవాటుగా వస్తోంది. ఈ నేపథ్యంలో గూడూరు సంత నుంచి స్వస్థలాలకు తిరిగి వస్తుండగా పోలీసు చెక్‌పోస్టు వద్ద తమ నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారని వ్యాపారులు లబోదిబోమంటున్నారు.

కడపలో రూ.3లక్షలు...

కడప (క్రైం), మార్చి 29: కడప నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని కో-ఆపరేటివ్ కాలనీ సమీపంలో శనివారం ఆకస్మికంగా పోలీసులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఎఫ్‌ఎస్‌టీ ఫ్లయింగ్ స్క్వాడ్ వారు షేక్ సమీర్ అనే వ్యక్తి వద్ద నుంచి రూ.3 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈనగదును తదుపరి చర్యల కోసం ఇన్‌కంట్యాక్స్ వారికి పంపించారు.

35 చీరలు పట్టివేత

కడప నగరం చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో కారును తనిఖీ చేసి 35 చీరలను స్వాధీనం చేసుకున్నట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు. ప్రొద్దుటూరు వస్త్రభారతి షాపింగ్ మాల్‌లో దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తి మాధవరంలో 31 చీరలు కొనుగోలు చేసి ప్రొద్దుటూరుకు వెళుతుండగా వాహన తనిఖీల్లో చీరలను గుర్తించి సీజ్ చేశారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

67 మద్యం సీసాలు స్వాధీనం



మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి

పోరుమామిళ్ల, మార్చి 29: ప్రభుత్వ అనుమతి లేకుండా తరలిస్తున్న 67 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. శుక్రవారం పోరుమామిళ్లలోని మల్లకతవ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కాశినాయన మండలం వంకమర్రి గ్రామానికి చెందిన నరసింహులు అనే వ్యక్తి వద్ద 15 బీరు సీసాలు, కలసపాడు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన దారం రామక్రిష్ణ వద్ద 52 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. అలాగే ఎలాంటి బిల్లులు లేకుండా రూ.1,01,100 డబ్బులు తీసుకెళుతున్న రాయచోటికి చెందిన రామక్రిష్ణ అనే వ్యక్తి వద్ద నగదును సీజ్ చేశామన్నారు.

మూడు గడ్డివాములు దగ్ధం



ఖాజీపేట మార్చి 29: ప్రమాదవశాత్తు సరాయిపల్లెలో మూడు గడ్డివాములు అగ్నికి ఆహుతి అయ్యాయి. మైదుకూరు మండలం సరాయిపల్లెకు చెందిన బి.సుబ్బారెడ్డి అన్నదమ్ముల గడ్డివాముల్లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో గుర్తించిన గ్రామస్థులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే 500 కట్టలకుపైగా గడ్డి కాలిపోయిందని వీటి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి



రాజుపాలెం, మార్చి 29 : మండల పరిధిలోని తొండలదిన్నె గ్రామానికి చెందిన నొస్సం బాబుషా (17) అనే యువకుడు శుక్రవారం విద్యుత్‌షాక్‌తో మృతి చెందినట్లు ఎస్‌ఐ తులసి నాగప్రసాద్ తెలిపారు. నొస్సం సంజీవ కౌలుకు భూమి తీసుకుని వరి పంట సాగు చేశాడన్నారు. ఆ పొలానికి సాగునీరు పారించేందుకు ఆయన కుమారుడు బాబుషా అక్కడికి వెళ్లాడని, సాగునీటిని విడిచే సమయంలో ప్రమాదవశాత్తు మోటారుకు విద్యుత్ సరఫరా కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రిఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముదివేడు దండుమారెమ్మ జాతరకు 20 ఆర్టీసీ బస్సులు

మదనపల్లె అర్బన్, మార్చి 29: ముదివేడులో రెండు రోజుల పాటు నిర్వహించే దండుమారెమ్మ జాతరకు మదనపల్లె నుంచి 20 ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం, ఆదివారం ముదివేడులో ఘనంగా నిర్వహించే దండు మారెమ్మ జాతరకు మదనపల్లె వన్ డిపో నుంచి ముదివేడు కోసువారిపల్లె మధ్య ఒక బస్సు శనివారం నుంచి ఆదివారం సాయంత్రం వరకు, కదిరి తేరును పురస్కరించుకుని మదనపల్లె- కదిరికి అదనంగా ఐదు బస్సులు శనివారం నుంచి నడుపుతున్నట్లు మేనేజరు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

- కడపకు చెందిన హరికృష్ణగా పోలీసుల అనుమానం



కల్లూరు, మార్చి29: చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరు పట్టణంలో శుక్రవారం అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ రవిప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం... కల్లూరు నుంచి పులిచెర్లకు వెళ్లే రోడ్డుకు సమీపంలోని పొలంలో శుక్రవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు కల్లూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ తన సిబ్బందితో చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అతడి వయసు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. మృతుడి తలపై గాయంతోపాటు మృతదేహానికి సమీపంలో రెండు రాళ్లపై రక్తపు మరకలు ఉండటాన్ని గుర్తించిన పోలీసులు హత్య జరిగి ఉండవచ్చన్నారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో కడప జిల్లాకు చెందిన హరికృష్ణగా పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి మృతదేహానికి శవ పరీక్ష నిమిత్తం పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ కేసును చేధించేందుకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని ఎస్‌ఐ తెలి పారు. ఎవరికైనా మృతుడి వివరాలు తెలిసే 9490617887, 9440796721 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ తెలిపారు.

నిబంధనల ఉల్లంఘనపై మాజీ సర్పంచుకు జరిమానా

పీలేరు, మార్చి 29: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న పీలేరు మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు హబీబ్ బాషాకు రూ.2 వేల జరిమానా విధించినట్లు ఏఆర్‌వో మహబూబ్ బాషా శుక్రవారం తెలిపారు. మార్చి 29వ తేదీ నుంచి ఏప్రిల్ 12వ తేదీ వరకు ఇంటింటి ప్రచారం నిర్వహించుకునేందుకు ముందస్తు అనుమతి తీసుకున్నప్పటికీ, కరపత్రాలు పంచేందుకు అనుమతి తీసుకోకపోవడంతో ఆయన నోటీసు జారీ చేసి, జరిమానా విధించడమే కాకుండా కరపత్రాలు సీజ్ చేసినట్లు వివరించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారం కోసం 48 గంటలు ముందుగానే అనుమతి తీసుకోవాలని, పీలేరు తహసీల్దారు కార్యాలయంలో నేరుగా గానీ, 'సువిధ' యాప్‌లోగానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

2న మదనపల్లెకు సీఎం జగన్ రాక

మదనపల్లె, మార్చి 29: మదనపల్లెకు ఏప్రిల్ 2వ తేదీన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రానున్నట్లు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, అన్నమయ్య జిల్లా వైసీపీ అధ్యక్షుడు గడికోట శ్రీకాంత్ రెడ్డిలు తెలిపారు. స్థానిక పుంగనూరురోడ్డులోని ఎంపీ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో మేమంతా సిద్ధం పేరుతో సీఎం జగన్ చేస్తున్న బస్సుయాత్ర వివరాలను వెల్లడించారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

బి. కొత్తకోట, మార్చి29: బి. కొత్తకోట పట్టణంలో జరిగిన ఓ సంఘటనలో నిందితుడైన జి.రమణ (25)ను శుక్రవారం అరెస్టు చేసి పోక్సోయాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు. నిందితుడిని రంగసముద్రం రోడ్డులోని పాత ఆర్టీసీ డిపో వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సారా కేసులో వ్యక్తి అరెస్ట్

కలకడ, మార్చి 29: అక్రమంగా సారా కలిగి ఉన్న చలప తినాయక్ అనే వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. మండ లంలోని ఎగువతాండకు చెందిన చలపతి వద్ద 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వైసీపీ ప్రచారంలో పాల్గొన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి తొలగింపు

ప్రొద్దుటూరు, మార్చి 29: ప్రొద్దుటూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాచమల్లుతో పాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న జిల్లా ఆసుపత్రి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ యు.వెంకటరెడ్డిపై ఎన్నికల అధికారులు వేటువేశారు. ఇటీవల 36 వ వార్డు ప్రచారంలో ఈయన పాల్గొన్నట్లు ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనం ఆధారంగా ఎఫ్‌ఎస్‌టీ టీం విచారణ చేపట్టింది. వెంకటరెడ్డి ప్రచారంలో పాల్గొన్నట్లు ఈ టీం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఎన్నికల అధికారులు ఈయనను విధుల నుంచి తొలగించారు. ఆమేరకు ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌కు లెటర్ పెట్టామని ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆనంద్ ఎన్నికల అధికారులకు నివేదిక పంపారు.

ప్రొద్దుటూరు ఎంసీసీ నోడల్ అధికారికి ఆర్‌వో నోటీసు

ప్రొద్దుటూరు, మార్చి 29: ప్రొద్దుటూరు నియోజకవర్గం పరిధిలో ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) నోడల్ అధికారి, మున్సిపల్ కమిషనర్ రఘునాధరెడ్డికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కౌసర్‌భాను షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లపై కోడ్ ఉల్లంఘన కేసులు ఎందుకు నమోదు చేయలేదని ఆమె ఆ షోకాజ్ నోటీసులో వివరణ కోరారు. కేవలం ఎన్నికల ప్రచారంలో పాలొన్న వలంటీర్లను విధుల నుంచి తొలగించటం తప్ప వారిపై కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేయకపోవడంపై ప్రశ్నించారు. దీంతో శుక్రవారం ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని విధులనుంచి తొలగింపునకు గురైన ఏడుగురు వలంటీర్లపై కోడ్ ఉల్లంఘన కేసులు నమోదు చేయమని ఎంసీసీ నోడల్ అధికారి సంబంధిత సచివాలయ అడ్మిన్‌లకు ఆదేశాలిచ్చారు.

ఆ మేరకు వారి పరిధిలోని పోలీసు స్టేషన్లో వలంటీర్లపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేస్తున్నారు. వలంటీర్లలో గోపిరెడ్డి ధనుంజయ (హరిజనవాడ-2), కాసారపు సుబ్బారావు (కొత్తపల్లి-3), మామిళ్లజ్యోతి (హరిజనవాడ-4), మిద్దేల వసుంధర (హరిజనవాడ-4), మునగాల లిఖిత (హరిజనవాడ-4), మారుపల్లే రామతులసి (హరిజనవాడ-4), ఎస్.అరుణ (వెంకటేశ్వర్ల పేట) సచివాలయాల పరిధిలో వీరిపై కేసు నమోదు చేశారు.

జగన్మోహన్‌రెడ్డి అభివృద్ధి నిరోధకుడు

- కడప పార్లమెంటులో విజయఢంకా మోగిస్తాం
- టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి



జమ్మలమడుగు, మార్చి 29: రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి అభివృద్ధి నిరోధకుడని, ఆయన పాలనతో జనం విసిగిపోయి ఉన్నారని , కడప పార్లమెంటు పరిధిలో తాము విజయఢంకా మోగిస్తామని టీడీపీ కడప ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప పార్లమెంటు పరిధిలో ఏడు నియోజకవర్గాల్లో ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు అందరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఇప్పటి నుంచి ఏడు నియోజకవర్గాల్లోని నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో కలిసికట్టుగా టీడీపీ అధిష్టానం ఇచ్చిన ఆదేశాల ప్రకారం ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేసి కడపజిల్లా పార్లమెంటుస్థానాన్ని అత్యధిక మెజార్టీతో విజయఢంకా మోగించాలన్నారు. ఆదిశగా ప్రతి ఒక్కరు కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. కిందిస్థాయి నుంచి జమ్మలమడుగు నియోజకవర్గంలో టీడీపీని బలోపేతం చేసినందుకు అదిష్టానం తనకు కడప పార్లమెంటు అభ్యర్థిగా అవకాశం కల్పించిందన్నారు. జమ్మలమడుగు మండలంలో స్టీల్‌ప్లాంట్ బాధితుల సమస్యలకోసం, నిరుద్యోగుల సమస్యలకోసం పాదయాత్ర చేశానన్నారు. కొండాపురం ముంపు బాధితుల సమస్యలకోసం, పెద్దముడియంలోని రాజోలి బాధిత రైతుల కోసం పాదయాత్ర చేసి బాధితుల సమస్యలను తెలియజేయడం తనకు గుర్తింపునిచ్చిందన్నారు. అందరినీ కలుపుకుని వెళ్లి కడప ఎంపీగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

నీటికోసం ఘర్షణ

ఖాజీపేట మార్చి 29: మండల పరిధిలోని చెముళ్లపల్లె గ్రామానికి చెందిన ఇద్దరు ఘర్షణ పడటంతో గాయాలయ్యాయి. చెముళ్లపల్లె గ్రామానికి చెందిన రామసుబ్బారెడ్డి, జయరాం పంట పొలం వద్ద నీటికోసం ఘర్షణ పడటంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



నేడు చంద్రబాబు సమక్షంలో బీసీ నేత టీడీపీలో చేరిక


ఖాదర్‌బాషా

రాజుపాలెం, మార్చి 29 : ప్రొద్దుటూరు పట్టణం శివాలయం సెంటరుకు శనివారం చంద్రబాబు ప్రజాగళం రోడ్‌షో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ రోడ్‌షోలో రాజుపాలెం మండలం టంగుటూరు గ్రామానికి చెందిన బీసీ నేత మానుకింది ఖాదర్‌బాషా వైసీపీ నుంచి టీడీపీలోకి చేరుతున్నట్లు పేర్కొన్నారు. పది సంవత్సరాలుగా వైసీపీలో మంచి గుర్తింపు ఉన్న నాయకుడిగా ఉండి కొద్దిరోజులుగా పార్టీకి ఖాదర్‌బాషా దూరంగా ఉంటూ వస్తున్నారు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల ఖాదర్‌బాషా వైసీపీలో కొనసాగారు. ఎమ్మెల్యే రాచమల్లు వర్గానికి దూరంగా ఉంటున్నారు. చంద్రబాబు సారథ్యంలో బీసీలకు మేలు జరుగుతుందని భావించి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ వేడుకలు

ప్రొద్దుటూరు, మార్చి 29 : అణగారిన వర్గాలకు అండగా నిలబడిన జెండా టీడీపీనే అని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నెహ్రూ రోడ్డులోని టీడీపీ ఎన్నికల క్యాంపు కార్యాలయంలో టీడీపీ ఆవిర్భావ సభ ఘనంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం సురేష్ నాయుడు జెండా ఎగుర వేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మెన్ ఆసం రఘురామి రెడ్డి, మాజీ ఇన్‌చార్జ్ చైర్మెన్ ముక్తియార్, ఘంటశాల వెంకటేశ్వర్లు,ఈవీ సుధాకరరెడ్డి, నల్లబోతుల నాగరాజు, మహ్మద్‌గౌస్, అమీర్‌బాషా, ఖలీల్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అట్లూరు.: మండలంలోని రెడ్డిపల్లె టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం మండల టీడీపీ అధ్యక్షుడు పి.మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జ్ పోతిరెడ్డి రెడ్డయ్య, జయక్రిష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఈటె మస్తాన్, సుధాకర్‌రెడ్డి, గంగిరెడ్డి, నరసారెడ్డి, జయరామిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, కోనయ్య, పి.నరసింహులు, రిషికేశవ, అయ్యవారయ్య, సంజీవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.


పోరుమామిళ్లలో జెండా ఎగురవేస్తున్న విజయమ్మ

పోరుమామిళ్ల..: పోరుమామిళ్లలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ సమక్షంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. శుక్రవారం సాయంత్రం పోరుమామిళ్లలోని సీసీఆర్ కాంప్లెక్స్ సమీపంలో టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా టీడీపీ శ్రేణులు పాల్గొని జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చెరుకూరి చెన్నరాయుడు, కల్వకూరి నడిపి వెంకటసుబ్బయ్య, కల్వకూరి చిన్న వెంకటసుబ్బయ్య, సీతా వెంకట సుబ్బయ్య, ఇమాంహుసేన్, శెట్టెం ప్రతాప్, తిరుమలశెట్టి సుబ్బారావు, కనుమర్లపూటి రామసుబ్బారావు, నాగభూషణం, ఎంపీటీసీ కల్వకూరి రమణ, తిరుమలశెట్టి సుబ్బారావు, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భూపేశ్‌రెడ్డిని ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడంతో సంబరాలు



జమ్మలమడుగు, మార్చి 29: జమ్మలమడుగులో రెండు నెలలుగా కార్యకర్తల్లో ఉత్కంఠ ఉండేది. టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డికి ఎమ్మెల్యే టిక్కెట్ రాకపోవడంతో కార్యకర్తలు, అభిమానులు ప్రతిరోజు టీడీపీ కార్యాలయం వద్దకు వచ్చి చర్చించుకునేవారు. శుక్రవారం మధ్యాహ్నం టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డికి కడప ఎంపీ టిక్కెట్ ప్రకటించడంతో కార్యకర్తల్లో ఉత్సాహం రెట్టింపు అయింది. వెంటనే స్థానికులు టీడీపీ కార్యాలయం వద్దకు వచ్చి పూలమాలలతో సత్కరించి టపాసులు కాల్చారు. అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగూర్, జికెగైబూ, పాండురంగడు, శ్రీనివాసులు, మల్లికార్జున, కొండయ్య, తలమంచిపట్నం లక్ష్మణనాయుడు, సయ్యద్, నవనీశ్వరరెడ్డి, కిరణ్‌రాయల్, శివారెడ్డి, ఖాదర్, సుదర్శన్‌రెడ్డిలతోపాటు నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలి వచ్చారు. కాగా మండలంలోని పొన్నతోట గ్రామస్థులు డ్రమ్స్ ఎదుట సంబరాలు జరుపుకున్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలు

జమ్మలమడుగు, మార్చి 29: జమ్మలమడుగులో శుక్రవారం భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని ఆయా చర్చిలలో క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని టౌన్‌చర్చి, ఎస్పీజీ క్వార్టర్స్ చర్చి, మోరగుడి, పెద్దదండ్లూరు, గొరిగెనూరు, దేవగుడి, దానవులపాడు, గూడెం చెరువు, ఎస్.ఉప్పలపాడు తదితర గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ప్రొద్దుటూరు టౌన్..: గుడ్‌ఫ్రైడే వేడుకలను పట్టణంలోని చర్చిలలో ఘనంగా నిర్వహించారు. గోకుల్‌నగర్‌లోని ఎస్పీజీ-2 చర్చిలో పాస్టర్ రెవరెండ్ పోలాటి రాజు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం క్రైస్తవులు భక్తిగీతాలు ఆలపించారు. రామేశ్వరంలోని సీఎస్ఐ చర్చిలో రెవరెండ్ డాక్టర్ జాకోబ్‌ఫ్రాంక్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరాధన మహోత్సవం నిర్వహించారు. వైఎంఆర్ కాలనీలోని గోల్డెన్ జూబ్లీ చర్చి, మైదుకూరు రోడ్డులోని ఎస్పీజీ-1 చర్చి, దొరసానిపల్లెలోని ఎస్పీజీ-3 చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

బద్వేలు..: ఏసు క్రీస్తు ప్రభువు చేసిన త్యాగమే శుభశుక్రవారం (గుడ్ ఫ్రైడే) అని స్థానిక పట్టణ సెయింట్ పాల్స్ సీఎస్ఐ చర్చి డీనరీ చైర్మన్ రెవరెండ్ ఆనంద్‌కుమార్, జీవన్‌బాబులు ఉపదేశించారు. ఈ కార్యక్రమంలో సంఘ సెక్రటరీ జి.కె.ఎడ్వర్డ్, ట్రెజరర్ మూరతోటి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపుతోనే పల్లెల్లో ప్రగతి


టీడీపీలో చేరిన వారితో మైదుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్

ఖాజీపేట మార్చి 29: రాష్ట్రంలో టీడీపీ గెలుపుతోనే పల్లెలు ప్రగతిపథంలో పయనిస్తాయని మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బి.కొత్తపల్లెలో ముత్తూరు శ్రీనివాసులరెడ్డి, అశోక్‌రెడ్డి, ముత్తూరు వెంకటరెడ్డి, చిరంజీవిరెడ్డి, మణికంఠారెడ్డి అనుచర వర్గం మండల అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో దాదాపు 70 కుటుంబాలు టీడీపీ కండువా కప్పుకున్నాయి. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మల్లోత్ర, బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుబ్బరాయుడు, టీడీపీ నాయకులు బీఎన్.శ్రీనివాసులు, జెండాల మాబాష, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ వెంకటసుబ్బయ్య, కిశోర్‌కుమార్‌రెడ్డి, గోవిందు సుబ్బయ్య, శ్రీను, ఏటూరు చంద్ర ఓబుళరెడ్డి, హరినాథరెడ్డి, నంద్యాల సుబ్బయ్య, రాము, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

బొజ్జా రోశన్న గెలుపునకు కృషి చేయాలి

బద్వేలు టౌన్, మార్చి 29 : బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి బొజ్జ రోశన్న గెలుపునకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహిం చారు. పొత్తులో భాగంగా బొజ్జ రోశన్నను అభ్యర్థిగా కేటాయించారని అన్నారు.టీవీఎస్ రవి, రామచంద్రారెడ్డి, మన్యం రామిరెడ్డి, వెంగల్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

కాశినాయన..: వచ్చే సాధారణ ఎన్నికల్లో టీడీపీ,జనసేన,బీజేపీ కూటమి తరుపున బరిలోఉన్న బీజేపీ అభ్యర్థి బొజ్జా రోశన్న గెలుపునకు కృషిచేయాలని బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం నర్సాపురంలోని టీడీపీ కార్యాలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు అధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి,విజయ్‌కుమార్‌రెడ్డి, డి.క్రిష్ణారెడ్డి, హోండా రవీంద్రారెడ్డి, పి.పోలిరెడ్డి, సర్పంచ్ ఖాజావలి, ఉల్లి నాగరాజు, ఎల్.శ్రీని వాసులరెడ్డి,కే.దుగ్గిరెడ్డి, బి.రాజశేఖర్‌డ్డి, ఓ.రోహిత్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రామచంద్రయ్యనాయుడు, అడవి రాముడు,గురయ్య, టి.నరసింహులు,రమణారెడ్డి, వెంకటేష్ పీరయ్య, హుసేనయ్య, క్రిష్ణయ్య, షరీఫ్,పుల్లయ్య, కమలనాథ్,చెన్నారెడ్డి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భూపేశ్‌రెడ్డిని ఆదరించండి

కొండాపురం, మార్చి 29 : టీడీపీ కడప పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న భూపేశ్ రెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి జ్యోతి ప్రజలను అభ్యర్థించారు. మండలంలోని బ్రాహ్మణపల్లె,ఉస్తికాయలపల్లె,కొట్లాలపల్లె,కొత్తపల్లె రామిరెడ్డిపల్లె గ్రామాలలో శుక్రవారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మండల టీడీపీ మహిళా అధ్యక్షురాళ్లు ఇందిరమ్మ, పద్మజ పాల్గొన్నారు.



